5. ఓ యన్నలారా పాడుఁడీ
యౌదార్యతన్ సర్వేశున్
ఓ యమ్మలారా మ్రొక్కుఁడీ
ప్రియాతి ప్రియుఁడేసు
6. ఓ పిల్లలారా కొల్వుఁడీ
యౌన్నత్య రాజు నేసున్
తపించువారి దాతయౌ
దయామయున్ శ్రీ యేసున్
7. శ్రీ యేసుకై యర్పించుఁడీ
మీ యావజ్జీవనమును
ప్రియంపు దాసులౌచును
రయంబు గొల్వుఁడేసున్

– విలియం హంటర్

అను: ఆల్ ఫ్రెడ్ త్యాగరాజు సామర్

# పశ్చాత్తాపము

## 313 పశ్చాత్తాప ప్రార్థన

రా – యదుకుల కాంభోజి తా–ఆది

[1]త్రాహి [2]మాం క్రీస్తు నాథ – దయఁ జూడ రావే = నేను – [3]దేహి యనుచు నీ పాదములే – దిక్కుగాఁ జేరితి నిపుడు ॥త్రాహి॥

1. గవ్వ చేయరాని చెడ్డ – కర్మేంద్రియాధీనుఁడనై – [4]రవ్వ పాలై నే నెంతో – [5]నెవ్వఁ బొందితిఁ – త్రవ్వుచున్న కొలఁదిఁ – పెరుఁగుఁ – దరగదు నా పాప రాశి – యివ్విధమునఁ జెడిపోతినినే – నేమి సేతు నోహోహోహో ॥త్రాహి॥

2. నీ యందు భయభక్తులు లేని – [6]నిర్లజ్జాచిత్తముఁ బూని – చేయరాని దుష్కర్మములు – చేసినాఁడను = దయ్యాలరాజు చేతిలోఁ–జేయి వేసి వాని పనులఁ – జేయ సాగి నే [7]నిబ్భంగిఁ – జెడిపోయితి నే నయ్యయ్యయ్యొ ॥త్రాహి॥

3. నిబ్బర మొక్కించుకైన – నిజము రవ్వంతైన లేక – దబ్బర లాడుటకు ము –త్తా నైతిని = అబ్బురమైన ఘోర పా – పాంధకార కూపమందు – దబ్బున బడిపోతి నయ్యో – దారి చెడి నేనబ్బబ్బబ్బా ॥త్రాహి॥

[1]రక్షించుము. [2]నన్ను. [3]ఇమ్ము. [4]అపకీర్తి. [5]ఆపద. [6]సిగ్గులేనిమనస్సు. [7]ఈ విధమున.



4. నిన్నుఁ జేరి సాటిలేని – నిత్యానంద మందఁబోవు – చున్నప్పుడు నిందలు నా – కెన్ని చేరినా = విన్నదనము లేకుండ నీ – వే నా మదికి ధైర్యమిచ్చి–యన్నిట రక్షించి తివి నా – యన్న నీకు స్తోత్ర మహోహో ॥త్రాహి॥

– పురుషోత్తము చౌదరి

## 314 దావీదు కీర్తన 51

రా – శంకరాభరణము తా–ఏక

దేవ! దీనపాపిని – ఓ పావన – గావు కృపా బాహుళ్యము చేత ॥దేవా॥

1. ఖలుడనో దేవా! నా నిలువెల్ల పాపంబె = మలినత్వమును బాపి – మాన్యు జేయవె తండ్రీ! ॥దేవ॥

2. నీకు కేవలంబు – నీకే విరోధముగ = ప్రాకొని నే ఘోర – పాపం బొనర్చితిని ॥దేవ॥

3. నాయతిక్రమ మెప్డు – నా యెదుట నున్నది = నా యెదను భారంబై – నను ద్రుంచుచున్నది ॥దేవ॥

4. పాపంబులోనే యు – ద్భవించినాడను = పాపంబులోనే గ – ర్భము దాల్చినది తల్లి ॥దేవ॥

5. ఎదయందు సత్యంబే – యెడఁగోరు చుందువు = హృదయమందున జ్ఞాన – మొదవ జేతువు నాకు ॥దేవ॥

6. కలిగించు నాలో ని – ర్మల శుద్ధ హృదయంబు = నిలుకడైన మనసు నిలుపు మాంతర్యమున ॥దేవ॥

7. త్రోసివేయకు నన్ను – నీ సన్నిధి నుండి = తీసివేయక నుంచు = మీ శుద్ధాత్మను నాలో ॥దేవ॥

8. నీ రక్షణానంద –మో రక్షకా మరల = చేరదీసి యిచ్చి– స్థిరపరచు నా మనసు ॥దేవ॥

9. కావవే కర్తార – క్తాపరాధమునుండి = కావు నే నుత్సాహ – గానంబుఁ జేసెద ॥దేవ॥